సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



వరద జోరు.. గోదావరి హోరు

ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి బరాజ్‌ల గేట్లు ఎత్తడంతో కాళేశ్వరం వద్ద గోదావరి నదికి వరద జోరు పెరుగుతోంది. - 8లో



నాలుగు గంటలు.. నరకయాతన

ఈదుల పూసపల్లి శివారులోని రాళ్లవాగు వరద ఉధృతిలో కొట్టకుపోయిన వారు నాలుగు గంటల పాటు నరకయాతన అనుభవించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
29.2^0 /24.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ నుంచి అతి భారీ వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిలిచిన బొగ్గు ఉత్పత్తి



మల్హర్: రెండు రోజులుగా కురిసిన వర్షం కారణంగా తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లోకి భారీగా వర్షపు నీరు చేరి బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో ఓసీపీలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ఓబీ, 12వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిలిపోయినట్లు ఏఎమ్మార్ అధికారులు తెలిపారు.

లాభాల వాటా 35శాతం ప్రకటించాలి

భూపాలపల్లి అర్బన్: 2023-24 ఆర్థిక సంవత్సరం లాభాల వాటా కార్మికులకు 35శాతం ప్రకటించాలని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఏరియాలోని అన్ని గనుల మేనేజర్లకు వినతిపత్రాలు అందజేసినట్లు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి వ్యాప్తంగా సాధించిన లాభాలను ఇప్పటి వరకు యాజమాన్యం ప్రకటించకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదానందం, మల్లారెడ్డి, నరేష్, సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



మల్హర్: రెండు రోజులుగా కురిసిన వర్షానికి పెద్దతాడిచర్ల గ్రామంలో సోమవారం ఇల్లు కూలిపోయింది. బాధితుడు దేవర రాజనర్సు తెలిపిన వివరాల ప్రకారం.. ఓసీపీలో నిత్యం జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో తమ ఇల్లు నెర్రెలు బారిందని తెలిపారు. దీనికి తోడు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఇల్లు, గోడలు తడిసి పోయి కూలి పోయిందన్నారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. ఓసీపీ బ్లాస్టింగ్‌ల కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే తమను ఓసీపీ అధికారులు, ప్రభుత్వం న్యాయం చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో బస్‌షెల్టర్లు ఏర్పాటుచేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్, గణేష్‌చౌక్‌లలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు పడిగాపులు కాస్తూ బస్సుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండలో ఎండుతూ, వానలో నానుతున్న పరిస్థితులు దాపరించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, సాయితేజ పాల్గొన్నారు.

రేగొండ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రాంప్రసాద్‌రావు



రేగొండ: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గడ్డం రాంప్రసాద్ రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. రేగొండ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన వెంకటేశ్వర్ రావు సెలవుపై వెళ్లారు. ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్న రాంప్రసాద్‌రావుకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

9నుంచి ఎంపిక శిబిరాలు

భూపాలపల్లి రూరల్: బ్యాటరీ ట్రైసైకిల్, కాలిపర్స్, కృత్రిమ కాళ్లు, వినికిడి మిషన్లు, వీల్ చైర్లు, స్టిక్స్ అవసరమున్న దివ్యాంగుల కోసం ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు ఎంపిక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలీంకో సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 9న మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయంలో పలిమెల, మహదేవపూర్, మల్హర్ మండలాలకు, 10న మహాముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో మహాముత్తారం, కాటారం, 11న జెడ్పీ సీఈఓ కార్యాలయంలో భూపాలపల్లి, రేగొండ, కొత్తపల్లి (గోరి), గణపురం, 12న చిట్యాల తహసీల్దార్ కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల దివ్యాంగులు హాజరుకావాలని సూచించారు. హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, మూడు పాస్‌ఫొటోలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 96523 11804 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.

వంట వండేదెలా..


నిర్వాహకులకు భారంగా 'మధ్యాహ్న భోజనం'

- జిల్లాలో రూ.46లక్షల బిల్లులు పెండింగ్
- అప్పులు చేసి ఇబ్బందులు..

కాటారం: నెల నెల రావాల్సిన బిల్లులు కొన్ని మండలాల్లో నాలుగు నెలలు, మరికొన్ని మండలాల్లో రెండు నెలలుగా రాకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో సుమారుగా రూ.46లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ఓ వైపు.. బిల్లులు రాకపోవడం మరోవైపు.. దీంతో నిర్వాహకులకు వంట చేయడం భారంగా మారుతోంది.

ధరల పెరుగుదలతో ఇబ్బందులు

మధ్యాహ్న భోజనానికి పౌరసరఫరాల శాఖ నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. ఇతర సామగ్రి నిర్వాహకులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజనంలో ఆకుకూరలు, వారానికి మూడు సార్లు కోడిగుడ్లు అందజేయాలి. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు కుకింగ్ చార్జీల కింద ఒక్కొక్కరికి రూ.5.45 చెల్లిస్తారు. ఆరవ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు రూ.7.17 చెల్లిస్తారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.9.95 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. కోడిగుడ్డుకు రూ.5 చెల్లిస్తుంది. కానీ ప్రస్తుతం కోడిగుడ్డు ధర రూ.6 ఉండగా టమాట, దోసకాయలు, ఆలుగడ్డ, బీరకాయ, దొండకాయతో పాటు ఆకు కూర ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఏ కూరగాయల ధర చూసినా కిలోకు రూ.60 కంటే తక్కువగా లేదు. కోడిగుడ్డుకు ఒక్కో దానికి రూపాయి అదనంగా చెల్లించి విద్యార్థులకు పెట్టాల్సి వస్తుందని.. కూరగాయలు అధిక ధరలకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుండడంతో అప్పుల పాలవుతున్నట్లు నిర్వాహకులు చెప్పుకొస్తున్నారు. ధరలు పెరుగుతున్నప్పుడు అందుకు అనుగుణంగా బిల్లులు పెంచడం లేదని అంటున్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో భోజన పథకం నిర్వహణ మరింత భారం అవుతుంది.



జిల్లాలో పాఠశాలల వివరాలు..

ప్రభుత్వ పాఠశాలలు	432
విద్యార్థులు	22,142
వంట నిర్వాహకులు	510
వంట ఏజెన్సీలు	415



4 నెలలుగా పెండింగ్..

జిల్లాలో 12 మండలాల్లో మొత్తం 432 పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు భోజనం పెట్టేందుకు ఒక పాఠశాలకు నెలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా సుమారు రూ.లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు వ్యయం అవుతుంది. జిల్లాలో ఇప్పటి వరకు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సుమారు రూ.46లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. కొన్ని పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంకు సంబంధించిన చివరి రెండు నెలలు, ఈ విద్యా సంవత్సరం జూన్, జూలై నెలలకు సంబంధించిన బిల్లులు అందలేదని నిర్వాహకులు చెబుతున్నారు. పెరిగిన కూరగాయల ధరలు, గుడ్లు, పప్పు దినుసులు, వంట చెరుకు, గ్యాస్ ధరలతో తమపై అధిక మొత్తంలో ఆర్థిక భారం పడుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇబ్బందులు పడుతున్నాం..



అప్పు తెచ్చి పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నాం. నిత్యావసర సరుకుల కోసం కిరాణాల వద్ద అప్పు తెస్తున్నాం. అప్పు సొమ్ము ఎక్కువ అయితే కిరాణ యజమానులు సైతం నిరాకరిస్తున్నారు. కోడిగుడ్ల ధరలు పెరగడంతో మేమే గుడ్డుకు రూపాయి కలుపుకుని పిల్లలకు పెడుతున్నాం.

- విజయ, నిర్వాహకురాలు, తాడిచర్ల

ఆర్థిక భారం అవుతోంది..



ప్రస్తుతం కూరగాయల ధరలు, వంట సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదు. మేము అదనంగా డబ్బులు కలుపుకొని విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. పెరిగిన ధరల కారణంగా మాపై ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వం ధరలకు అనుగుణంగా మాకు బిల్లులు పెంచాలి.

- సుజాత, నిర్వాహకురాలు, టేకుమట్ల

బిల్లులు అందేలా చూస్తాం..



మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూస్తాం. నిధులు మంజూరు కాగానే సంబంధిత ఏజెన్సీల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఏజెన్సీ నిర్వాహకుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం భోజనం అందేలా చూస్తున్నాం.

- రాజేందర్, డీఈఓ

కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



ముంపు ప్రాంతాల ప్రజలను
అప్రమత్తం చేయాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ
- కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి పరిశీలన

కాళేశ్వరం: ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. సోమవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో వరద ఉధృతిని తెలుసుకున్నారు. ఎగువ నుంచి వరద ఎంతమేరకు దిగువకు తరలివస్తుందని అధికారులతో తెలుసుకున్నారు. వరద ఉధృతి గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వరద ముంపు ప్రాంతమైన పూస్కుపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ముంపుగ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎగువ ప్రాంతాలలో వర్షం కురిస్తే గోదావరి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంటుందని, ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తనకు తెలియజేయాలని తెలిపారు. గోదావరిలోకి స్నానాలు చేయడానికి భక్తులను అనుమతించవద్దన్నారు. గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి మరింత పెరిగితే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ, మండల ప్రత్యేకాధికారి వీరభద్రయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ సూర్యప్రకాశ్, ఏఈఈ శిరీష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సీడబ్ల్యూసీ సైట్ ఇంజనీర్ శ్రీకాంత్, సీఐ రామచంద్రరావు, ఎస్సై చక్రపాణి పాల్గొన్నారు.



పూస్కుపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, అధికారులు

గణపేశ్వరుడికి లక్షబిల్వార్చన



ప్రత్యేక అలంకరణలో గణపేశ్వరుడు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గణపురం: శ్రావణ మాసం చివరి రోజు సందర్భంగా గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్ల(గణపేశ్వరాలయం)లో గణపేశ్వరుడికి సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. శ్రావణమాసం చివరి సోమవారంతో పాటు పొలాల అమవాస్య సందర్భంగా ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్షబిల్వార్చనతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు నాగరాజు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సోమవారంతో కోటగుళ్లలో శ్రావణమాసోత్సవాలు ముగిశాయి.

గణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు

కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై ఐడీఓసీ కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, మున్సిపాలిటీ, మత్స్యశాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. గణపతి నిమజ్జనం జరిగే చెరువులు, వాగులు, గోదావరి నది వద్ద పోలీస్ శాఖ తరఫున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్య శాఖ ద్వారా గజఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అంబులెన్స్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ద్వారా గణపతి మండపాలకు విద్యుత్ అనుమతులు జారీ చేయాలని, విద్యుత్ తీగల కింద, స్తంభాల మండపాలను ఏర్పాటు చేయకుండా నియంత్రణ చేయాలన్నారు. కాళేశ్వరం గోదావరి వద్ద వినాయక ప్రతిమలు నిమజ్జనం జరిగే చోట క్రేన్‌లు ఏర్పాటుచేసి ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి అవినాష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్‌లో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 17 దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, ఆర్డీఓ మంగీలాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- డీఎంహెచ్‌ఓ మధుసూదన్
- జిల్లా కేంద్రంలో ఆస్పత్రుల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ఆదేశించారు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల 'ఇష్టారాజ్యం' శీర్షికన గతనెల 27న సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌ఓ స్పందించారు. సోమవారం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి కేసులు నమోదైతే జిల్లా వైద్య శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. రక్త పరీక్షల ఫీజుల వివరాలను డాక్టర్ల జాబితాను స్థానిక భాషలో ఆస్పత్రిలో బోర్డుపై ప్రదర్శించాలన్నారు. లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ప్రభుత్వ డాక్టర్లు, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే వైద్యులు విధుల సమయాల్లో ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేయవద్దన్నారు. కొందరు వైద్యులు ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. మరోసారి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేకుండా నడిచే ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిని డాక్టర్ శ్రీదేవి, మాస్ మీడియా అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.



ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యురాలితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మధుసూదన్



క్యూలైన్‌లో నిల్చుని.. లైసెన్స్ రెన్యువల్

జిల్లా జడ్జి పి.నారాయణబాబు సోమవారం సామాన్యుడిగా చెల్పూర్‌లోని రోడ్డు రవాణా శాఖ కార్యాలయంలో క్యూలైన్‌లో నిల్చుని తన లైసెన్స్ రెన్యువల్ చేసుకున్నారు. క్యూలైన్‌లో జడ్జిని చూసిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

- భూపాలపల్లి రూరల్

67శాతం బొగ్గు ఉత్పత్తి

ఏరియా సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్

భూపాలపల్లి అర్బన్: ఆగస్టు నెలలో భూపాలపల్లి ఏరియాలోని కాకతీయ గనుల్లో 67శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ తెలిపారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఆగస్టు నెలలో 2,61,700 టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 1,74,641 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఓపెన్‌కాస్ట్-2, 3 ప్రాజెక్టులలో 22లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు చేసినట్లు తెలిపారు. భూగర్భ గనులకు నూతన ఎస్‌డీఎల్ యంత్రాలు కొనుగోలు చేసి బొగ్గు ఉత్పత్తి పనులను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు కార్మికులందరూ సమష్టి కృషిచేయాలని సూచించారు. కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తి పెంచే విధంగా కార్మికులకు అవగాహన కల్పించాలని కోరారు. అధికారులు ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా వర్కింగ్ పర్మిషన్ వంటి నియమ నిబంధనలు పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని, రక్షణ విషయంలో రాజీ పడేదే లేదన్నారు. కారుణ్య నియామకాలు వెంటవెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు సురేఖ, మారుతి, రాజు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం హబీబ్ హుస్సేన్

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా పవిత్రం శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా కాటారం గ్రామానికి చెందిన పవిత్రం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ కన్వీనర్ వంగేటి అశోక్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి పట్టణకేంద్రంలోని వాసవి మాత దేవాలయంలో సోమవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి పవిత్రం శ్రీనివాస్, మహదేవపూర్ నుంచి శివనాత్రి ప్రదీప్ కుమార్ నామినేషన్ వేయగా.. స్క్రూటినీలో ప్రదీప్‌కుమార్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. అధ్యక్షుడిగా పవిత్రం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అశోక్ ప్రకటించారు. అనంతరం అధ్యక్షుడిగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వైశ్యులు సీనియర్ నాయకులు శిరుప అనిల్, ఐతు రమేష్, సోమ శాంత కుమార్, మదూరి ముక్తేశ్వర్, అనంతుల శ్రీనివాస్, రవీందర్, బచ్చు ప్రకాశ్, మధ్య నవీన్ కుమార్, మద్ది సూర్యనారాయణ, కలికోట దేవేందర్, కలికోట వరప్రసాద్, సిరిపురం శ్రీమాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

పెరుగుతున్న మానేరు ఉధృతి

మల్హర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా జిల్లా సరిహద్దు తాడిచర్ల, ఖమ్మంపల్లి, అడవి సోమన్‌పల్లి మానేరు, మల్లారం ఆరెవాగు ఉధృతి పెరుగుతుంది. మండలంతో పాటు భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలో కురిసిన వర్షాలతో మానేరుకు భారీగా వరదనీరు చేరుకుంది. దీంతో మండలంలోని వల్లెకుంట, కుంభంపల్లి మానేరు శివారులోని పంట పొలాలకు చెందిన రైతుల మోటర్లు, స్టాటర్లు, పైప్‌లైన్లు వరద ఉధృతిలో కొట్టుకుపోయాయి.



అల్లకల్లోలం


దోర్నకల్ : ముల్కలపల్లి సమీపంలో పొలాల్లో ఇసుక మేటలు


మహబూబాబాద్: మున్నేరు సమీపంలో నేలవాలిన వరి పంట


ఖానాపురం: పాకాల పరిధిలో వరి పంటలో ఇసుక మేటలు


కురవి శివారులో మిరప తోటలో ఇసుక మేటలు


తాడ్వాయి- పస్రా మధ్య ధ్వంసమైన రోడ్డు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఈ వర్షం ధాటికి గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. శిథిలావస్థలోని ఇళ్లు కూలుతున్నాయి. కాలనీలు జల ప్రవాహంలో చిక్కుకుంటున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ తెగుతున్నాయి. ఫలితంగా జనజీవనం స్తంభిస్తోంది. పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్


తాడ్వాయిలో కౌలు రైతు బంగారు నర్సమ్మ పొలంలో ఇసుక మేటలు


నర్సింహులపేట: కౌసల్యదేవిపల్లి ఆకేరు బ్రిడ్జి వద్ద వరద ఉధృతికి సగానికి పైగా కోతకు గురైన రోడ్డు


నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో ఇసుక మేటగా మారిన పొలాలు


మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం సమీపంలో ధ్వంసమైన 365 జాతీయ రహదారిని పెకిలిస్తున్న జేసీబీ


చిన్నగూడూరు: వరద ఉధృతికి ఆలయాల చుట్టూ తేలిన రాళ్లు


కాటారం: ఇబ్రహీంపల్లిలో కూలిన ఇల్లు


నెల్లికుదురు: వరదతో రావిరాల గ్రామంలో నేలమట్టమైన ఇల్లు


దోర్నకల్: ముల్కలపల్లి వద్ద ఆకేరు వరదలో కొట్టుకుపోయి తేలిన జేసీబీలు, ట్రాక్టర్లు

వరద జోరు.. గోదావరి హోరు


కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్‌ను తాకుతూ వెళ్తున్న గోదావరి


సమ్మక్క బరాజ్ వద్ద దిగువకు తరలుతున్న నీరు

- కాళేశ్వరం వద్ద 11.110 మీటర్ల ఎత్తులో నీటిమట్టం
- అన్నారం బరాజ్‌కు 6.87 లక్షలు, మేడిగడ్డకు 8.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నదికి వరద జోరు పెరుగుతోంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి బరాజ్‌ల గేట్లు ఎత్తడంతో దిగువన గోదావరికి వరద నీరు చేరుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతి) బరాజ్‌కు భారీగా వరద రాగా, దీనికితోడు పెద్దవాగుకు వరద పోటెత్తడంతో 6.87 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. బరాజ్‌లోని మొత్తం 66గేట్లు ఎత్తడంతో ఆ వరద నీరంతా దిగవన కాళేశ్వరం వైపునకు పరుగులు తీస్తోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. రెండు నదులు కలిసి కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్లను తాకుతూ 11.110 మీటర్ల ఎత్తులో వరద నీరు దిగువకు తరలుతోంది. దీంతో మేడిగడ్డ(లక్ష్మి)బరాజ్ వద్దకు 8.35 లక్షల క్యూసెక్కుల వరద తరలి రాగా, బరాజ్‌లోని మొత్తం 85గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు తరలిస్తున్నారు.

గోదావరి ప్రాంతాల్లో పంట నీటమునక..

భారీ వర్షాల కారణంగా మహదేవపూర్ మండలంలో పత్తి, వరి, మిర్చిపంట నీటమునిగింది. దీనితోడు గోదావరికి వరద ఉప్పొంగడంతో వరదనీరు పరీవాహక ప్రాంతాల్లోని పంటల్లోకి చేరింది. దీంతో ఆయా పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాళేశ్వరం, పూస్కుపల్లి, బెగులూర్‌లోని కొంగలవాగు ఉధృతంగా ప్రవహించి పంట చేనుల్లోకి నీరు చేరింది. దీంతో పంట నీటమునిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. కానీ వ్యవసాయశాఖ అధికారులు మాత్రం అటు వైపు రాలేదని పేర్కొన్నారు. అధికారులు పంట నష్టం సర్వేచేయాలని కోరుతున్నారు. మహదేవపూర్ మండలంలో ప్రాథమికంగా సుమారు 100 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు.

సమ్మక్క సాగర్ 59 గేట్లు ఎత్తివేత..

కన్నాయిగూడెం : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ నుంచి సోమవారం 3లక్షల 84వేల 210 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారి సాయిరాం తెలిపారు. మూడు రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో బరాజ్ వద్దకు వరద నీరు పోటెత్తింది. దీంతో అప్రమత్తమైన అధికారులు బరాజ్‌వద్ద ఉన్న ఉన్న 59 గేట్లు ఎత్తివేశారు. కాగా, వరద మరింత వస్తుందని అంచనా వేసిన అధికారులు గేట్లు ఎత్తి ఉంచడంతో వచ్చిన వరద వచ్చినట్లు కిందకు వెళ్తోంది. ప్రస్తుతం బరాజ్ వద్ద నీటి మట్టం 76.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. దేవాదుల వద్ద ఉన్న మోటార్లను నిలిపివేశారు. దేవాదులకు కూడా బ్యాక్ వాటర్ వచ్చి చేరుతోంది.

రైళ్ల రద్దు కొనసాగింపు..

- కాజీపేట మీదుగా వెళ్లే 14 రైళ్ల రద్దు
- పలు ట్రైన్ల దారి మళ్లింపు

కాజీపేట రూరల్ : మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నె -కేసముద్రం సెక్షన్ ట్రాక్ ఘటనతో సోమవారం రెండో రోజు కూడా దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు రూట్లలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

సోమవారం కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, ఈ నెల 5వ తేదీన డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

పార్శల్లీ రద్దు

ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు భద్రాచలంరోడ్-సిర్‌పూర్ టౌన్ (17033) ప్యాసింజర్ భద్రాచలం-కాజీపేట మధ్య రద్దు, ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు సిర్‌పూర్ టౌన్-భద్రాచలంరోడ్(17034) ప్యాసింజర్‌ను కాజీపేట-భద్రాచలం రోడ్ మధ్య రద్దు చేసినట్లు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట జంక్షన్, నాగపూర్, నడికుడ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లను సోమవారం రైల్వే అధికారులు దారి మళ్లించి నడిపించారు.

రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సోమవారం సికింద్రాబాద్-విశాఖపట్నం(22204) ఎక్స్‌ప్రెస్, ఆదిలాబాద్-నాందేడ్ (17409) ఎక్స్‌ప్రెస్, నాందేడ్-ఆదిలాబాద్ (17410) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 3న సిర్‌పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్(17234), సికింద్రాబాద్-విశాఖపట్నం (20834) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20708) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం(20707) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-షాలిమార్(12774) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 4న షాలిమార్-సికింద్రాబాద్ (12773) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నాలుగు గంటలు.. నరకయాతన

- రాళ్లవాగులో కొట్టుకుపోయిన డీసీఎం
- నలుగురిని కాపాడిన పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు


రాళ్లవాగు వరద ఉధృతి నుంచి బయట పడింది వీరే..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి శివారులోని రాళ్లవాగు వరద ఉధృతిలో ఆదివారం రాత్రి డీసీఎం కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కాగా, ఈ వాహనంలో ఉన్న ఐదుగురిలో ఒకరు గల్లంతుకాగా నలుగురు సురక్షితంగా బయటకు వచ్చారు. వారంతా నాలుగు గంటల పాటు వరద నీటి ఉధృతిలో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నరకయాతన అనుభవించారు. సంగారెడ్డి జిల్లా మాచునూర్‌కు చెందిన డ్రైవర్ నులక ప్రవీణ్ కుమార్.. హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని రిలయన్స్ మార్ట్‌కు డీసీఎంలో సరుకులు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈదులపూసపల్లి రాళ్ల వాగు వద్ద వరద ఉధృతి ఎక్కువ ఉందని గ్రామస్తులు తెలుపగా వాహనం అక్కడే నిలిపి ఉంచాడు. కేసముద్రంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోగా అందులో ప్రయాణించిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన టికీ సునీల్‌కుమార్, అదే మండలం కుతుకులూరుకు చెందిన నక్కిన నాగభూషణం, గుంటూరులోని శ్రీనగర్ కాలనీకి చెందిన వేణుకోటయ్య ప్రైవేట్ వాహనాల ద్వారా ఈదులపూసపల్లికి వచ్చారు. కేసముద్రం గ్రామానికి వెళ్లిన మహబూబాబాద్ పట్టణంలోని మంద కొమురమ్మనగర్‌కు చెందిన దుస్సా దుర్గాప్రసాద్ కూడా ఈదులపూసపల్లికి చేరుకున్నాడు. ఈ నలుగురుతో పాటు డీసీఎం డ్రైవర్ అంతా కలిసి అదే వాహనంలో మహబూబాబాద్‌కు వద్దామని నిర్ణయించుకోగా వరద ఉధృతి తగ్గకపోవడంతో రెండు గంటల పాటు రాళ్లవాగు వద్దే వేచి ఉన్నారు. ఆ సమయంలో గ్రామస్తులు అక్కడే ఉండమని చెప్పారు. కొంత సమయం అక్కడే వేచి ఉండి అనంతరం ప్రయాణం మొదలుపెట్టారు. డీసీఎం కొంతదూరం వచ్చాక వాగు ఉధృతిలో కొట్టుకుపోయింది. అందులో ఉన్న వ్యక్తుల అరుపులు విన్న స్థానికుల సమాచారం మేరకు డీఎస్పీ తిరుపతిరావు, టౌన్, రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, రూరల్ ఎస్సై దీపిక, తహసీల్దార్ భగవాన్ రెడ్డి హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. టార్చ్‌లైట్ల వెలుతురుతో పరిశీలించగా కొందరు చెట్టుకొమ్మలను పట్టుకుని ఉన్నట్లు, కొందరు వాహనంలో ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేకంగా జేసీబీ తెప్పించి డీసీఎంలో ఉన్న వ్యక్తుల వద్దకు వైర్లు, రబ్బరు టైర్లు, ట్యూబ్‌లు వదిలారు. మొదట నాగభూషణం ఆ ట్యూబ్ సాయంతో ఒడ్డుకు వచ్చే ప్రయత్నం చేయగా కొంత దూరం వచ్చి వరద ఉధృతిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. అంతలోనే ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను పిలిపించగా వారు నాటు పడవతో వరదనీటిలోకి దిగి గంటల కొద్ది కష్టపడి మిగతా నలుగురిని అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో బయటకు తీసుకువచ్చారు. కాగా జరిగిన ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ డీసీఎం డ్రైవర్ నులక ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి నీరు


కేసముద్రం స్టేషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

కేసముద్రం: కేసముద్రం- ఇంటికన్నె- తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల పరిధిలో సుమారు 26 చోట్ల రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. అమీనాపురం చెరువు మత్తడి పోస్తోంది. ఆ నీరంతా కేసముద్రం స్టేషన్‌లోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి కల్వర్టు పైవరకు వరదనీరు తాకింది. ఇదే మాదిరి వర్షం ఎక్కువైతే ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ విధంగా ఇంటికన్నె, కేసముద్రం మధ్య, తాళ్లపూసపల్లి, కేసముద్రం మధ్యలోని కల్వర్టుల వద్ద వరద ఉధృతి పెరిగితే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ట్రాక్ కింద నిలిచిన నీరు



గార్ల: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని గండిచెరువు పక్కన ఉన్న రైల్వేట్రాక్ భారీవర్షాలు కురిస్తే వరద ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. 10 ఏళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు అలుగు పోస్తుండడంతో గండిచెరువు పక్కన డబ్బాల మోరీ వద్ద రైల్వేట్రాక్ కింద మట్టి, కంకర కొట్టుకుపోయి రైల్వేపట్టాలు నీళ్లలో తేలాయి. దీంతో రైల్వే యంత్రాంగం ఈ ప్రాంతంలో రైల్వేట్రాక్ కింద రాళ్లతో నిర్మాణం చేపట్టి వరదనీరు వెళ్లేందుకు మోరీలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిస్తే వరదనీరు రైల్వే పట్టాల పైనుంచి వెళ్లే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో గండి చెరువు నిండి 2 నెలల పాటు రైల్వేట్రాక్ కింద 5 ఫీట్ల నీళ్లు నిలిచి ఉంటాయి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

డేంజర్.. డేంజర్

వరద నీటితో రైల్వే ట్రాక్‌లకు పొంచి ఉన్న ప్రమాదం


అయ్యప్పటెంపుల్ ఏరియాలో రైల్వేట్రాక్ పక్కన నిలిచిన వరద నీరు


జనగామ: 384 నంబర్ కల్వర్టు వద్ద పిచ్చి మొక్కలతో నిండిన బ్రిడ్జి

జనగామలో రైల్వే ట్రాక్ పక్కనే వరద..

- ఒకే చోట రోజుల తరబడి నీటి నిల్వ

జనగామ: జిల్లా పరిధిలోని రైల్వే ట్రాక్‌కు పెద్ద ప్రమాదం లేకున్నా.. చిన్న చిన్న లోపాలపై దక్షిణ మధ్య రైల్వే అధికారులు దృష్టి సారించడం లేదు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతికి మహబూబాబాద్ జిల్లాలో రైల్వే ట్రాక్ కొట్టుకు పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం 'సాక్షి' జిల్లా పరిధి రైల్వేట్రాక్ ప్రస్తుత పరిస్థితులపై విజిట్ చేసింది. చిన్న చిన్న లోపాలు ఉన్నట్లు గుర్తించింది. జనగామ మండలం పెంబర్తి నుంచి చిల్పూరు మండలం చిన్న పెండ్యాల వరకు జిల్లా పరిధిలో 45 కిలోమీటర్ల మేర రైల్వేట్రాక్ విస్తరించి ఉంది. పెంబర్తి నుంచి జనగామ వరకు 5 కిలోమీటర్ల దూరం. జనగామ నుంచి యశ్వంతాపూర్-6, యశ్వంతాపూర్ నుంచి రఘునాథపల్లి-6, రఘునాథపల్లి నుంచి ఇప్పగూడెం-9, ఇప్పగూడెం నుంచి స్టేషన్‌ఘన్‌పూర్-7, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నష్కల్-7, నష్కల్ నుంచి చిన్న పెండ్యాల-5 కిలోమీటర్లు ఉంటుంది. జనగామ పట్టణం బాణాపురం సమీపాన 384 కల్వర్టు రైల్వే అండర్ బ్రిడ్జి కింద పిచ్చి మొక్కల కారణంగా రోజుల తరబడి వరద నీరు నిలిచి ఉంటోంది. భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ నుంచి వచ్చే వరద ముందుకు వెళ్లలేని సమయంలో ప్రమాదం పొంచి ఉంటుంది. అలాగే, బాణాపురం అయ్యప్ప టెంపుల్ ఎదుట కట్టపక్కన అర కిలోమీటరు మేర నిలిచిన వరద నీరు కుంటను తలపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు ఎటూ వెళ్లలేక ట్రాక్ కట్టకు ఆనుకుని నిలిచిపోయి.. అందులోనే ఇంకిపోతోంది. పట్టణంలోని పాత బీటు బజారు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్వహణ అధ్వానంగా మారింది. బ్రిడ్జికి మొత్తం ఆరు అండర్ నాలాలు ఉండగా.. పిచ్చి మొక్కలు, చెత్తతో నిండి నీరు రోజుల తరబడి నిలుస్తోంది. వరద ఉధృతి పెరిగిన సమయంలో ఇబ్బందులు తప్పవని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిల్పూరు, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో రైల్వేట్రాక్‌కు ఎలాంటి ప్రమాదం లేదు. ఇప్పగూడెం వద్ద ఈ నెల 1న మధ్యాహ్నం పట్టాలపైకి వచ్చిన కొద్దిపాటి వరద నీరు సాయంత్రానికి తగ్గు ముఖం పట్టింది. రైల్వేట్రాక్ ఎగువ ప్రాంతంలో ఉండడంతో నష్టం జరిగే అవకాశం లేదు.

చెరువులతో కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ట్రాక్‌కు ప్రమాదం

- అప్రమత్తమైన రైల్వే అధికారులు
- రాత్రి, పగలు పెట్రోలింగ్ ముమ్మరం


నష్కల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్ సమీపానికి చేరిన వరదతో స్తంభించిన రాకపోకలు

కాజీపేట రూరల్: మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లి-ఇంటికన్నె రైల్వే ట్రాక్ ఘటనతో సోమవారం రైల్వే అధికార యంత్రాగం అప్రమత్తమైంది. రైల్వే ట్రాక్ వద్ద గస్తీ మరింత ముమ్మరం చేసి, సమీప చెరువుల వద్ద ప్రమాదాలపై జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గొలుసుకట్టు చెరువులతో రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆయా చెరువులు నిండాయి. మరో రెండు రోజులు ఇలాగే కురిస్తే గొలుసు కట్టు చెరువులు తెగి రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అప్రమత్తమై ఇసుక, కంకర, మట్టి బస్తాలు, మెటీరియల్, సిబ్బందిని అన్ని విధాలా అప్రమత్తం చేసినట్లు వారు తెలిపారు.

ట్రాక్ గస్తీ ముమ్మరం

వడ్డేపల్లి చెరువు వద్ద రైల్వే ట్రాక్ వద్ద వరద నీటి మట్టాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండి పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేశారు. పెండ్యాల, రాజారం చెరువుతో నష్కల్ రైల్వే రోడ్ అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే నష్కల్ వద్ద రైల్వే గేట్ నంబర్ 53 వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి వద్దకు వరద నీరు చేరి నష్కల్, వంగాలపల్లి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వంగాలపల్లి రైల్వే సర్వీస్ గేట్ నంబర్ 54లో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఘన్‌పూర్ సమీపంలో ఇప్పగూడ వద్ద రైల్ అండర్ బ్రిడ్జి వద్దకు వరద నీరు చేరింది.

గతంలో జరిగిన రైలు ఘటనలు

1954 సెప్టెంబర్ 27న యశ్వంతాపూర్ వాగులో వరద నీటిలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ 4 బోగిలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 300 మంది మృతి చెందారు. ఈ ఘటనపై నాటి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రీ రాజీనామా చేశారు. 1987 జూలై 9న మంచిర్యాల వద్ద దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ వరద నీటిలో 14 కోచ్‌లు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 53 మంది మృతి చెందారు. 2005 అక్టోబర్ 29న నల్లగొండ జిల్లా వలిగొండ వద్ద డెల్టా ప్యాసింజర్ వరదలో కొట్టుకుపోయిన ఘటనలో 114 మంది మృతి చెందారు. 200 మందికి గాయాలయ్యాయి.